# వైద్యుడు

గుమ్మా నిత్యకళ్యాణమ్మ



అన్ని విషయాల మాటకేంగానీ అతడు ఆ ఒక్క విషయంలో మాత్రం ప్రణాళికాబద్ధంగా నడచుకుంటాడు. అతని పేరు అప్పారావు. తల్లిదండ్రులది సింహాచలం. అందువలన వారికి పుట్టిన మొదటి బిడ్డకు అప్పారావు అని పేరు పెట్టుకున్నారు. వయసు పెరిగిన అప్పారావుకి ఆ పేరు సూటబుల్ అయి అతుక్కుపోయింది.

అప్పుడే దంతధావనం చేసి భార్య గౌరి పంపించిన కాఫీ త్రాగి ఆ రోజు ఏ ఏ రోడ్లమ్మట వెళ్లకూడదో ఎవరెవరికి మొహం చాటువేయాలో- అనే పథకాన్ని రోజూలా తీవ్రంగా ఆలోచించి, ఆ మేరకు కట్టుదిట్టమైన నిర్ణయాలు తీసుకున్నాడు. అంతటితో ప్రణాళికలోని

ముందు భాగం పూర్తయింది. ప్రణాళికలోని రెండవ భాగానికి రాగానే అతని మెదడు మొద్దుబారిపోయింది. ఏ తల మాసిన వాడి పేరూ తలకు తట్టలేదు.

రాకెట్టులా పనిచేసే తన మెదడు మొద్దుబారిపోయింది ఏల?

ప్రణాళికలో ఆ రెండో భాగం అతి ముఖ్యమైనది. దానికో దారి కనిపించకపోతే అతను అన్నం తినలేడు, తిన్నది అరిగించుకోలేడు.

మెదడు ఎందుకు పనిచేయటం లేదు?

కారణాలు అన్వేషించవలసిన పనిలేదు. కారణం స్పష్టంగా తెలుసు. అందుకు కారణం గౌరి కాక మరెవరవు"తారు?

తానేదైనా ఘనకార్యం చేసి సాధిస్తే అది తన ప్రతాపం. అది బెడిసికొట్టి ఆ కార్యం తుస్‌మంటే అందుకు భార్యే కారణం అని నెపం భార్యల మీదకు తోసి దండించే సగటు మనుషులు చాలామంది ఉంటారు. అలాంటి వారిలో ఒకడు అప్పారావు.

భార్య ఏం చేసింది?

ఆ రోజు ఆదివారం. ఆఫీసుకి సెలవని ఆమెకు తెలుసు. అయినా వది కాకుండా వంటవని పూర్తిచేయాలని వంటింటిలో కూచిపూడి చేస్తున్నది. తను నిద్రలేవక ముందే ఉప్మా తయారుచేసింది. మొహం కడుక్కుని గదిలోకి రాగానే శంభు చేత వేడి వేడి కాఫీ పంపించింది. ఇంతవరకు తనకు ముఖమైనా చూపించలేదు. ఆమె తనతో వాదన పెట్టుకోలేదు. అది లేదు, ఇది లేదు అని సతాయించలేదు. "ఏడు కావస్తున్నది ఇంకా పక్క దిగరా" అని మేలుకొలుపులు పాడలేదు. నిజం చెప్పాలంటే ఆమె తన జోలికే రాలేదు.

అయితేనేం మేకపిల్ల–తోడేలు కథ అప్పారావు చిన్నతనంలో విన్నాడు.

శంభుగాడి చేత కాఫీ పంపించింది. ఆ కాఫీ త్రాగటం వలననే తన మెదడు పనిచేయడం మానేసింది. ఆ కారణం చాలదూ!

"కాఫీ ఎందుకు పంపించావు? ఉదయాన్నే టీ ఇస్తే నీ సొమ్మేం పోతుంది?'' భార్యను ఇలా కడిగేయాలనుకున్నాడు.

అంతలోనే మరో ఆలోచన వచ్చి దానికి ఫుల్‌స్టాప్ పెట్టాడు.

''అయ్యో! వయసు పెరుగుతున్నకొద్దీ మీకు మతిపోతున్నాదిలాగుంది. ఈ రోజు కాఫీ గుండ నిండుకుంటే ఉదయాన్నే మిమ్మల్ని బజారుకెందుకు పంపడం అనుకున్నాను. తెల్లవారగానే మీ నోట్లో ఏదో ద్రావకం పడకపోతే హనుమంతుడిలా కుప్పిగెంతులేస్తారని టీ చేసి ఇచ్చాను. అప్పుడేం అన్నారు? 'గౌరీ! ఉదయమూ టీయేనా? రోజుకెన్నిసార్లు టీ త్రాగుతానో నీకు తెలుసా? ఉదయం లేవగానే చిక్కటి కాఫీ ఇస్తే మైండ్ ఫ్రెష్‌గా ఉంటుందని నీకు తెలియదా?' అన్నారు"

ఎప్పుడో తానన్నది గుర్తు చేసింది.

అంతటితో ఊరుకుంటే ఆమెను క్షమించగలడు. భార్యలకామాత్రం వాక్స్వాతంత్ర్యం ఉండవలసిందే. కానీ, ఆ తరువాత ఆమె అనేది తనను ఇబ్బందిపెడుతుంది.

"ఏం... నిన్న మీ ఆఫీసరు మిమ్మల్ని ఎడాపెడా తిట్టాడా? అత్తమీద కోపం దుత్తమీద అన్నట్లు ఉదయం లేవగానే నా మీద విరుచుకుపడుతున్నారు. అవునులెండి, రాత్రిపూట భార్య మీద మీరే కోపమూ ప్రదర్శించలేరు. అవసరం మీది. మీ మగవాళ్లను మా ఆడవాళ్లు ఏమంటారో తెలుసా? 'రాత్రి మొగుడు... పగలు యముడు' అని'' అని ముక్తాయింపుగా నవ్వేసి వెళ్లిపోయింది.

తెల్లబోవడం తనవంతు అయింది.

ఆమె మాటల్లో యధార్థం ఉండకుండా ఉంటుందా? (ఉందనేగా భావం!)

మెదడు పనిచేయడం లేదు.

పెళ్లాన్ని పిలిచి చీవాట్లు పెట్టాలని మొదటి భాగం నిర్ణయించుకున్నాడు. ఆవిడ విరుచుకుపడితే నోర్మూసుకోవాలా, లేక చెయ్యి చేసుకోవాలా అన్నది ఇంకా తేల్చుకోవాలి. అయితే ఆ అవసరం లేకపోయింది.

శంభు తన మెదడులో ట్యూబ్‌లైట్ వెలిగించాడు. సమస్య దానంతట అదే పరిష్కారమైంది.

"ఒరేయ్ శంభూ! ఆ చదివేదేదో స్పష్టంగా, గట్టిగా చదవరా" అన్నాడు అప్పారావు.

వరండాలో కూర్చుని శ్రద్ధగా పాఠం చదువుకుంటున్న శంభు అంటే అప్పారావు సుపుత్రుడు తండ్రి కేకకు తుళ్లిపడ్డాడు. ఇంతవరకు సరిగ్గా చదవరా చవట సన్నాసీ అని తల్లే మందలించేది. తండ్రికి ఏమీ పట్టేది కాదు. ఈ రోజు వాళ్లిద్దరూ డ్యూటీలు మార్చుకున్నారా?

తండ్రి ఆజ్ఞను శ్రీరామచంద్రుడంతటి వాడే శిరసావహించాడు. శంభుగాడెంత?

'అప్పిచ్చు వాడు వైద్యుడు
నెప్పుడు ఎడతెగక పారు ఏరుం ద్విజుడున్
చొప్పడిన వూరనుండుము
చొప్పడకున్నట్టి ఊరు చొరకుము సుమతీ!'

"ఆపరా ఆపు. అంత గట్టిగా అరిస్తే ఇంటి పైకప్పు ఎగిరిపోతుంది" అన్నాడు అప్పారావు. తను పొరపాటుగా వినలేదని ఇప్పుడు అర్థమైంది.

అయినా వాడు ఆ పద్యాన్ని ఏకధాటిగా అంతే పిచ్‌లో చదువుతూ వుంటే అప్పారావుకి తిక్కరేగింది. వీడు తన మాట వినడేం? గౌరే వాణ్ణి పాడుచేసింది.

"ఆపమన్నానా" అన్నాడు కోపంగా.

"నాన్నా! రేపు క్లాసులో ఈ పద్యాన్ని చూడకుండా రాయాలి" అని తండ్రికి సమాధానం చెప్పి, "అమ్మా! నేను ఆడుకోవడానికి వెళ్తున్నా'' అంటూ వాడు వెళ్లిపోయాడు.

వెనుకటికెవరో అద్దాల్లో బిడ్డనుంచుకుని ఊరంతా గాలించిందట. తనెంత బుద్ధిహీనుడు. నాలుగు వందల ఏళ్ల క్రితం బద్దెన చెప్పనే చెప్పాడు అప్పిచ్చువాడు వైద్యుడని. సుమతీ శతకం చిన్నప్పుడు తనూ చదివాడు. అప్పుడెలా అర్థమైందో గుర్తులేదు కానీ, ఈనాడు సరిగ్గా అర్థమైంది.

వెంటనే బట్టలు వేసుకుని బయటకు వెళ్తూ, "గౌరీ! తలుపేసుకో" అన్నాడు భార్యతో.

"ఉప్మా తినరా! అప్పుకేనా?" అంది గౌరి.

ఆ వీధి చివర్లో రమేష్‌బాబు డిస్పెన్సరీ ఉంది. అతను స్వంత ప్రాక్టీసు పెట్టి రెండు మూడేళ్లు కావస్తోంది. బాగా పరిచయం ఉన్నవాడే. అయితే డాక్టరు దగ్గరకు వెళ్లవలసిన అవసరం అప్పారావుకు ఇంతవరకు రాలేదు.

రెండడుగులు వేసి చెంపలేసుకున్నాడు. ఎంత పొరపాటు. తను ఉదయాన్నే తీసుకున్న నిర్ణయం ఏమిటి? నయమే, మరో పదడుగులు వేస్తే వెంకటస్వామి పాన్‌షాప్ వస్తుంది. మరో నాలుగైదు రోజుల వరకు ఆ దారిన వెళ్లడం నిషిద్ధం. తనే కనుక అలా నడచి వెళ్తే, "మాస్టారూ! నాలుగు రోజులైంది ఈ దారిన రావటమే మరిచారే!" అంటాడు.

అనడూ మరి!

అయిదు రోజుల క్రితం ఎక్కడా ఎర్రని ఏగానీ అప్పు పుట్టక విచారంతో ఇంటికొస్తూ వుంటే వెంకటస్వామి షాపు కనిపించింది. చిరునవ్వుతో పలకరించాడు వెంకటస్వామి. ఆ నవ్వే తన పాలిట దివ్వె అయింది. బేరాలెలా సాగుతున్నాయి అని బాగోగులడిగి మాటలతో వాడిని ఊదరగొట్టి, "వెంకటస్వామీ! అర్జంటుగా యాభై రూపాయలు కావాలోయ్. ఇల్లు దగ్గరే అయినా ఇంటికి వెళ్లడం అపశకునం. నేనా వెళ్తున్నది ఒక పనిమీద. రేపు ఉదయాన్నే నీ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇస్తాను" అన్నాడు.

"మాస్టారూ! మీరడిగితే కాదనలేను. రేపు మాట తప్పక ఇచ్చేయండి" అన్నాడు వెంకటస్వామి యాభై రూపాయలిస్తూ.

మాటే కాదు, తను బాట కూడా తప్పాడు.

అప్పారావు రైట్ ఎబౌట్ టర్న్ చేసి వేరే రూటులో రమేష్‌బాబు డిస్పెన్సరీకి వెళ్లాడు. అక్కడున్న జనాలను చూసి రోగాలెక్కువై పోయినట్లుందనుకున్నాడు.

అరగంటసేపు అలా బల్లమీద కూర్చుని ప్రణాళికను రూపొందించుకో సాగాడు. జనాలు తగ్గిన తరువాతనైతే బాగుంటుందని అతడి అభిప్రాయం. అయితే ఆ జనాలు ఒకంతట తగ్గుతారా? పాతవాళ్లు వెళ్లిపోతే కొత్తవాళ్లు వస్తున్నారు. కాలయాపన జరుగుతోంది.

ఆపద్బాంధవుడిలా కాంపౌండర్ కలుగజేసుకున్నాడు.

"మాస్టారూ! మీరలా కూర్చున్నారేం? డాక్టరు గారికి చూపించుకోరా?"

అప్పారావు లేచి డాక్టరు కెదురుగా కూర్చున్నాడు.

"ఏమిటి మీ జబ్బు?"

జబ్బు అన్న మాట డబ్బు అన్నట్లు వినిపించింది.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. అప్పారావు అప్పాలజీలో ఎంత సిద్ధహస్తుడైనా ఎవరి దగ్గరకు పడితే

## జోక్...

ఫస్టు తారీఖున రంగారావు, రామారావు జీతాలు తీసుకుని ఇంటికి తిరిగి వస్తున్నారు. రంగారావు విచారంగా ఉండడం చూసి రామారావు అతనితో–

"ఏమోయ్ రంగారావ్! అసలే జీతాలిచ్చిన రోజు కదా! ఈ రోజు కూడా విచారంగా ఉన్నావేమిటి?"

"ఏం జీతాల్లే! ఇంటికెళ్లగానే జీతం మొత్తం మా ఆవిడ లాగేసుకుంటుంది!"

"నాకా బాధేం లేదు. మా ఆవిడకి పేకాట నేర్పించానులే. ఒకవేళ జీతం లాగేసుకున్నా పేకాటలో తిరిగి రాబట్టుకుంటాను."

– దివాకర్

వారి దగ్గరకు వెళ్లడు. తెలిసిన ముఖాల దగ్గరకే వెళ్తాడు. బొత్తిగా తెలియని వాళ్లుంటే వాళ్లతో ముందు రోజు పరిచయం చేసుకుని ఈ ముఖం కొత్తది కాదన్న తరువాతే వెళ్తాడు.

చల్లకొచ్చి ముంత దాచడం ఎరగడు అప్పారావు.

"డాక్టరు గారూ! నాకు అర్జంటుగా వంద రూపాయలు కావాలి. మీ నాన్నగారిని అడిగితే వంద ఏం ఖర్మ, వెయ్యి అయినా ఇస్తారు. మీరుంటుండగా వారిని ఇబ్బందిపెట్టడం వ్యర్థం."

"అబ్బాయి స్కూలు ఫీజు కట్టాలి.

అమ్మాయి స్కూలు యూనిఫాం చిరిగిపోయింది. కొత్తది కుట్టించాలి.

మా మామ గారికి ఒంట్లో బాగోలేదని ఫోను వచ్చింది. మా ఆవిడను వెంటనే వాళ్ల ఊరు పంపించాలి.

ఓ ఫ్రెండ్ కొడుక్కి పెళ్లి. గిఫ్ట్ కొనాలి."

"ఆగండి... ఆగండి.. నేను వైద్యుణ్ణి. అప్పులిచ్చే షావుకారుని కాను. మీకు కావలసిన ఆసామి పొరుగు వీధిలో ఉన్నాడు."

"వడ్డీలకు అప్పులు తీసుకునే తాహతు నాకు లేదు. చేబదులు. జీతాలు రాగానే తిరిగిచ్చేస్తాను. 'వైద్యులే అప్పులిస్తారు' అని సుమతీ శతకకారుడు చెప్పాడు. అంత పెద్దమనిషి అబద్ధం చెప్తాడా? కావాలంటే ఆ మహాత్ముడు బద్దెనగారు నాలుగు వందల సంవత్సరాల క్రితం వ్రాసిన పద్యం మా వాడి తెలుగు వాచకంలో ఉంది. తెచ్చి చూపెట్టమంటారా? ఆ అవసరం లేదనుకోండి. మీరు మాత్రం ఆ పద్యం చదువుకోలేదా? అప్పిచ్చువాడు వైద్యుడని స్పష్టంగా అందులో వుందే!"

డాక్టర్ రమేష్‌బాబుకి కోపం వచ్చింది.

"కాంపౌండర్! ఇతనో పిచ్చివాడిలాగున్నాడు. మెడపట్టుకు గెంటెయ్" అన్నాడు.

అప్పారావుది భల్లూకపు పట్టు. ఇంతవరకు ఓటమిని చూడలేదు. తన భర్త ప్రాణాలను ఇచ్చేవరకు సావిత్రి యమధర్మరాజును ఎలా వదల్లేదో, అదే టైప్‌లో అప్పారావు అప్పు దొరికే వరకు వదలడు. అతను వెళ్లిన పని ఎప్పుడూ కాయ కాలేదు, పండే కానీ.

జీతాలు దొరికే రోజునైనా అతను అప్పు తీసుకునే ప్రాక్టీసుకు బ్రేక్ వెయ్యడు.

"ఒరేయ్ నానీ! రెవెన్యూ స్టాంప్ ఇస్తావా! నీ దగ్గర తీసుకుంటున్నానని బాధపడకు. రేపు కొని ఇస్తాను. సరా!" అంటాడు. అందులో మొదటి భాగం సరియైనదే. రెండో భాగం అబద్ధం.

కాంపౌండర్ అటుగా రావటం చూసి అప్పారావు కళ్లు తేలేశాడు. డాక్టరుగారు అది చూసి గాబరా పడ్డారు. ఇంతలో ఇతగాడికేమైంది? ఇలా కళ్లు తేలేశాడు. కాంపౌండర్ సహాయంతో బల్లమీద పరుండబెట్టాడు.

"ఉదయాన్నే ఇదో ముదనష్టపు కేసు. ఇతగాడు కనుక హరీ అంటే తన బిజినెస్ ఏంకాను? పోలీసులతో గొడవలు. తానొట్టి ఫూల్! ఇతడికి అంత్రగోగాలేమున్నాయో? వాడడిగిన వందా పారేసి వుంటే ఈ బాధలుండేవి కావు" అనుకున్నాడు డాక్టర్ రమేష్‌బాబు.

అప్పారావు ఆ సమయంలో కళ్లు మూసుకుని వున్నాడు. లేకుంటే అతని మనోభావాలు పసిగట్టి వుండేవాడు. ప్చ్! పథకం ఫెయిల్ అయిందా?

డాక్టరుగారు తన కాంపౌండర్‌ని అప్పారావు ఇంటికి పంపించాడు, అతని భార్యను తీసుకురమ్మని.

ఆ తరువాత అన్ని పరీక్షలు చేసి ఇతనికేం ఢోకా లేదని గ్రహించాడు డాక్టరు.

ఆ కబురు విన్న గౌరి గాబరా పడుతూనే వున్న పళాన బయలుదేరింది. ఎందుకైనా మంచిదని ఎదురింటి కామేశ్వరరావుని తోడు రమ్మనమని అడగడానికి వెళ్లింది.

కామేశం బట్టలు వేసుకుంటూ, "అప్పారావుకి ఏమైంది? నిన్నటి వరకు బాగానే వున్నాడే!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అయ్యో! ఈ ఉదయం కూడా బాగానే వున్నారు. శంభుగాడు చదువుకుంటూ వుంటే గట్టిగా చదవరా అని దెబ్బలాడాడు కూడా! చేసిన ఉప్మా అంతా అలాగే ఉండిపోయింది. ఆయన కిష్టం అని పులుసులో ములక్కాడలు వేశాను. ముద్దపప్పు వండాను. రెక్కలు పడిపోయేలా కొబ్బరి చట్నీ రుబ్బాను. అవన్నీ ఇప్పుడేం చేసుకోను?" అంది ఏడుస్తూ.

"ఏడవకు చెల్లెమ్మా! వాడికేం కాదు" ధైర్యం చెప్పాడు.

★★★

"ఏమైంది డాక్టరు గారూ! వారికేమైంది? ఏదైనా సూదిమందు ఇచ్చారా?"

"నీ భర్తకేం కాలేదమ్మా! ఓ వంద రూపాయలుంటే ఇయ్యి" అన్నాడు డాక్టరు.

మందుల కోసం కాబోలు అనుకున్నారు గౌరీ, కామేశ్వరరావులు.

"అయ్యో! ఉన్నపళాన బయలురాను. అయినా, ఆడదాన్ని, నా దగ్గర అంత ఎక్కడిది. పోపుల డబ్బాలో వుంటే పదో పాతికో వుంటాయి. అన్నయ్య గారూ! మీ దగ్గరుంటే ఇవ్వండి" అంది కామేశ్వరరావుతో.

గోడకు వేసిన సున్నం ఎలా రాదో అప్పారావు కిచ్చిన డబ్బు తిరిగి రాదని కామేశానికి తెలుసు. అయినా ఆపదలో ఆదుకోవాలిగా. పర్సులోంచి వంద కాగితం తీసి డాక్టరుకిచ్చాడు.

నిశ్చలంగా బెడ్‌మీద నిద్రపోతున్న అప్పారావు దగ్గరకెళ్లి, "ఇదిగో అప్పారావు గారూ! మీరడిగిన వంద రూపాయలు" అన్నాడు.

అప్పారావు అమాంతంగా లేచి కూర్చుని, "ఏది? ఇలాగివ్వండి. నాకు తెలీదా- వైద్యులు అప్పులిస్తారని" అన్నాడు సంతోషంగా.

"ఆ పప్పులేం ఉడకవు. ఈ వందా నా ఫీజు. అమ్మా! మీ ఆయన్ని ఇంటికి తీసుకెళ్లండి" అన్నాడు డాక్టరు ఆ నోటును డ్రాయర్లో పడేస్తూ.

తెల్లవారి లేస్తూనే ఎవరి ముఖం చూశానో అనుకున్నాడు కామేశం బాధగా. ●

## సమాధి మీద శాసనం

**(EPITAPH)**

నీ కోట గోడకు
ఒక బండరాయిగా పడివుండడం కంటే
నీ మీద సాగే యుద్ధంలో
శిరస్సు తెగిన మొండెం లాగైనా
పడివుంటా...

నిన్ను నమ్ముకొని స్తుతిస్తూ
వందల సంవత్సరాలు జీవించడం కంటే
నాకు నేనుగా
కొన్ని క్షణాలైనా బతుకుతా...!

నీకు గులాంగా సలాం కొట్టడం కంటే
నీ మీదకు ఎక్కుపెట్టే ఖడ్గమౌతా...!

నీ అస్త్రాలతోనే
నీ రాజ్యాన్ని ముట్టడిస్తా చూడు...!

ఇలా... ఇలా...
నిలదీసి నినదించినందుకు
హక్కుల్ని అడిగినందుకు
అన్యాయాన్ని ప్రశ్నించినందుకు
అందరి కోసం గొంతెత్తినందుకు...

ఒక కర్కశమైన రాజాజ్ఞ
శిరస్సును ఖండించింది...!

సమాధి మీద
శాసనాన్ని మోస్తున్నాను...

ఒక హెచ్చరిక
రాతిబండకు చెక్కిన అక్షరాలు...

ఇప్పుడే కంఠాల కవాటాలు తెరుచుకోవడం
లేదు
ఇప్పుడే కేకలు పెదవులు దాటడం లేదు
ఇప్పుడే చేతులు పిడికిళ్లుగా మారడం లేదు
ఇప్పుడెవరూ ఎదిరించడం లేదు...
బెదిరించడం లేదు
భరించడానికే బానిసలయ్యారు!

సమాధి మీద
పూచిన రెల్లుగడ్డి పువ్వు చాలు
ఆశతో ఆశయాన్ని చిగురింపడానికి
ఆకాంక్షకు ఊపిరినివ్వడానికి
ఉదయించే సూర్యుణ్ణి చూడడానికి...!

*- వేంపల్లి గంగాధర్.*

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033.
E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.